





ప్రథమ స్థానం : ముగ్గు వేస్తున్న టి.జ్యోతి

● పలాసలో కన్నుల పండువగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గులపోటీలు
● భారీగా తరలివచ్చిన నారీమణులు



ముత్యాలముగ్గులను పరిశీలిస్తున్న గౌతు శిరీష, వజ్జ భవానీ, వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావుతోపాటు న్యాయనిర్ణేతలు

ముగ్గు మనోహరం



ద్వితీయ స్థానం : రంగవల్లి తీర్చిదిద్దిన సునీత



తృతీయ స్థానం : ముగ్గును అలంకరిస్తున్న భవ్యశ్రీ

(పలాస/ కాశీబుగ్గ/ పలాస రూరల్/ వజ్రపుకొత్తూరు/ మందస, జనవరి 6)

రంగురంగుల హరివిల్లులతో జిల్లాకు ముందే సంక్రాంతి పండగ వచ్చేసింది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో శనివారం పలాసలో నిర్వహించిన ముగ్గులపోటీలకు భారీ ఎత్తున మహిళలు, యువతులు తరలి వచ్చారు. విభిన్న ఆకృతులు, సందేశాలతో ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముగ్గులతో సందడి చేశారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సహకారంతో సాగాయి. పలాస-కాశీబుగ్గ శివాజీనగర్‌లోని మదర్ థెరిసా విద్యాలయం మైదానంలో శనివారం ఉదయం 10 గంటలకు ముగ్గులపోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి.. ముగ్గులను వేశారు. పలాసకు చెందిన టి.జ్యోతి ప్రథమ స్థానం, కాశీబుగ్గకు చెందిన జి.సునీత ద్వితీయ స్థానం, వజ్రపుకొత్తూరు మండలం కొండూరు గ్రామానికి చెందిన కె.భవ్యశ్రీ తృతీయ స్థానం బహుమతులు గెలుపొందారు. ఈ పోటీలకు మదర్‌థెరిసా విద్యాలయం ప్రతినిధులు స్పాన్సర్‌గా వ్యవహరించారు. ప్రథమ విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4వేలు, తృతీయ విజేతకు రూ.3వేలు నగదు ఇచ్చారు. టి.రమిత, ఎన్.భవాని, పి.సమీర, వి.సావిత్రి, పి.స్వాతికి ప్రోత్సాహకం కింద సంక్రాంతి చీరలు, బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రత్యేక షీల్డులు ఇచ్చారు. స్పాన్సర్ల లోగోలు వేసిన జె.సాద్విక, డి.కీర్తి, బి.భవ్యశ్రీలకు కెనరాబ్యాంకు మేనేజర్ కమలాకర్ చేతులమీదుగా గిఫ్ట్‌బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది వై.తవిటయ్య, మణికంఠ, సంతోష్‌కుమార్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పలాస-కాశీబుగ్గ శివాజీనగర్‌లోని మదర్‌థెరిసా విద్యాలయం మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు



నగదు బహుమతులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు జ్యోతి, సునీత, భవ్యశ్రీ

నేడు శ్రీకాకుళంలో ముగ్గుల పోటీలు

● ఎన్టీఆర్ ఎంసీహెచ్ గ్రౌండ్‌లో నిర్వహణకు ఏర్పాట్లు

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి: సంక్రాంతిని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం నగరంలో ఎన్టీఆర్ ఎంసీహెచ్‌స్కూల్ గ్రౌండ్స్‌లో ముగ్గులపోటీలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. ఎటువంటి రుసుము లేకుండా మహిళలు అందరూ ఉచితంగా ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. పోటీల నిర్వహణకు మీనాక్షి ఆసుపత్రి అధినేతలు గొండు శంకర్ (కృష్ణప్పపేట), డాక్టర్ గొండు గంగాధర్ (గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్) స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రథమ విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4వేలు, తృతీయ విజేతకు రూ.3 వేలు చొప్పున నగదు పురస్కారాలను అందజేస్తారు. జిల్లాస్థాయిలో గెలుపొందే విజేతను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తారు. నిబంధనలకు సంబంధించి.. ముగ్గుల పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు వగైరా సామగ్రి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. ముగ్గును చేతితోనే వేయాలి. జల్లెడ ఉపయోగించేందుకు అనుమతి ఉంటుంది. ముగ్గులో గొబ్బెమ్మలను, బతుకమ్మలను అమర్చవచ్చు. అవి తప్ప ఇతరత్రా వస్తువులను అమర్చకూడదు. ఆసక్తి చూపే మహిళలు నేరుగా పోటీల వద్దకు చేరుకోవచ్చును. సమాచారం కోసం 9985411526 నంబర్‌ను సంప్రదించాలి.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

ఎస్మా ప్రయోగం.. అప్రజాస్వామికం

● డిమాండ్లు పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదు: అంగన్‌వాడీ కార్యకర్తలు

కలెక్టరేట్, జనవరి 6: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె కొనసాగిస్తూనే ఉన్నారు. శనివారం కలెక్టరేట్ వద్ద జ్యోతిబాపూలే పార్కు ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో 24 గంటల రిలే నిరవధిక నిరాహార దీక్ష నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అప్రజాస్వామికం అని పేర్కొన్నారు. గౌరవ వేతనం తమ కొద్దు అని.. కనీస వేతనాలు అందజేయాలని నినాదాలు చేశారు. నిర్బంధాలకు భయపడబోమని, డిమాండ్లు పరిష్కరించేవరకూ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టు తీర్పును కూడా అమలుచేయపోవడంతో శోచనీయమన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ.. ఎస్మా ప్రయోగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమ్మె కార్మికుల హక్కు అని.. చట్టప్రకారం 15 రోజుల ముందే ప్రభుత్వానికి సమ్మె నోటీసులు అందజేశామని తెలిపారు. ప్రభుత్వ విధానం మారకపోతే ఆమరణ దీక్షకైనా అంగన్‌వాడీలు వెనుకాడబోరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎమ్‌కె పద్మజ, జి.గిరిజ, నీలవేణి, కె.లక్ష్మీనారాయణ, లక్ష్మి, ఎస్.రుక్మిణి, కమలమ్మ, జె.పార్వతి పాల్గొన్నారు.

కదంతొక్కిన మునిసిపల్ కార్మికులు

● కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి ● 79మంది అరెస్టు, స్టేషన్‌కు తరలింపు

అరసవల్లి, జనవరి 6: సమస్యల పరిష్కారం కోరుతూ.. మునిసిపల్ కార్మికులు కదంతొక్కారు. నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. అప్పటికే మోహరించిన పోలీసులు.. ముందుజాగ్రత్త చర్యగా మునిసిపల్ కార్మికులను, సీఐటీయూ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో కార్మికులు పోలీసుల చర్యలను ప్రతిఘటించారు. అరెస్టులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు సీఐటీయూ నాయకుడు తేజేశ్వరరావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.బలరాంను బలవంతంగా అరెస్టు చేశారు. మొత్తం 79 మందిని అదుపులోకి తీసుకుని 1వ పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలనే అమలు చేయమంటే అక్రమ అరెస్టులకు పాల్పడడం దారుణమని విమర్శించారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చించి సమస్యలను పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణరాజు, డి.యుగంధర్, ధనాలు చిట్టిబాబు, అరుగుల రాము, ఏ.శేఖర్, అర్జి గణేష్, జె.రమేష్, బి.సరోజ, జె.మాధవి, ఎం.పార్వతి, ఏ.శారద, టి.వెంకటలక్ష్మి, ఏ.లక్ష్మి, కె.భాగ్య, ఎన్.లలిత పాల్గొన్నారు.



శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మికుల నిరసన



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

కార్మిక ద్రోహి జగన్‌రెడ్డి

● రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
● టెక్కలిలో చంద్రన్న కార్మిక చైతన్యయాత్ర ప్రారంభం

టెక్కలి, జనవరి 6: 'రాష్ట్రాన్ని సీఎం జగన్‌రెడ్డి భ్రష్టు పట్టించారు. ఆందోళన ఆంధ్రాగా మార్చేశారు. కార్మిక ద్రోహిగా గుర్తింపు పొందారు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. శనివారం స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్(టీఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో చంద్రన్న కార్మిక చైతన్య యాత్ర బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పొట్టకొట్టిన సైకో జగన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో సాగనంపాలని పిలుపునిచ్చారు. 'టీడీపీ హయాంలో చంద్రన్న బీమాతో ఎంతోమంది కార్మికులను ఆదుకున్నాం. వైసీపీ పాలనలో రవాణారంగ కార్మికులు అవస్థలు పడుతున్నారు. భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై జగన్నాటకం ఆడుతున్నారు. ఆర్టీసీ కార్మికుల జీవితాలు రివర్స్ అయ్యాయి. విద్యుత్, పారిశ్రామిక రంగాల కార్మికులు దగాకు గురయ్యారు. అన్న క్యాంటీన్‌లు మూసివేసి పేద ప్రజల కడుపుకొట్టారు. కార్మికులను మానసిక క్షోభకు గురిచేసిన సైకో రెడ్డికి బుద్ధి చెప్పాలి' అని అచ్చెన్న సూచించారు. టెక్కలి నియోజకవర్గంలో వ్యాపార వర్గాల నుంచి కొంతమంది వైసీపీ నాయకులు చందాలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే టెక్కలిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'ఇటీవల జిల్లా నుంచి తిరుపతి పర్యటనకు వెళ్లిన సైకిల్ యాత్రికులను మంత్రి పెద్దిరెడ్డి ఆపేశారు. దమ్ముంటే ఈ బస్సు ఆపగలవా?' అని ప్రశ్నించారు. కార్మికుల కష్టాలను తెలుసుకుని.. గతంలో టీడీపీ అధినేత చంద్రన్న బీమా ద్వారా వారిని ఆదుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు, ప్రధానకార్యదర్శి అంబూరి సింధూజ, కణితి కిరణ్‌కుమార్, బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, బోయిన రమేష్, జీరు భీమారావు, ఎల్ఎల్ నాయుడు, మెండ దాసునాయుడు, కింజరాపు హరివరప్రసాద్, టీఎన్‌టీయూసీ నాయకులు నర్సింగరావు, దారపు రాము, రమణ ఉన్నారు.

టీడీపీలో 500 కుటుంబాలు చేరిక

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం మర్రిపాడు పంచాయతీకి చెందిన 500 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. శనివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో భారీగా చేరికలు జరిగాయి. ఈ క్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్, సర్పంచ్ అట్టాడ కల్పన ఆధ్వర్యంలో మర్రిపాడుకు చెందిన వైసీపీ సానుభూతిపరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. భావనపాడు చెందిన మాజీ నీటి సంఘ అధ్యక్షుడు బుడ్డా భీమారావు, తాళ్ళవలస మాజీ సర్పంచ్ గున్న నాగభూషణరావు, వడ్డివాడ మాజీ సర్పంచ్ బాడాన వసంతరావు తదితరులు టీడీపీలో చేరారు. వారిని అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర సాయం

● కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల



మాట్లాడుతున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల

ఎచ్చెర్ల, జనవరి 6: మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా నిధులు కేటాయిస్తోందని కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ శాఖా మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. బుడగట్లపాలెంలో శనివారం సాగర్ పరిక్రమ్ 10వ విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమం కోసం హార్బర్లు, జెట్టీలను, ఫిషింగ్ వినియోగపడే పరికరాలను మంజూరు చేస్తున్నామన్నారు. కేంద్ర సహాయమంత్రి ఎల్.మురుగన్ మాట్లాడుతూ.. గుజరాత్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి దేశవ్యాప్తంగా ఏడు వేల కిలో మీటర్ల పరిధిలోని మత్స్యకార ప్రాంతాల్లో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 215 మంది మత్స్యకారులకు రూ.1.01కోట్లు కిసాన్ క్రెడిట్ రుణాల చెక్కులు అందజేశారు. 147 ఫిషింగ్ విక్రయ శాలల ఏర్పాటుకు రూ.81.2 లక్షల మేర రాయితీ నిధులను అందజేశారు. ఎచ్చెర్ల మండలంలో మూడు పంచాయతీల్లో 200 మందితో మత్స్యకారుల ప్రాథమిక ఉత్పత్తిదారుల సంఘానికి రిజిస్ట్రేషన్ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర మత్స్యశాఖ సంయుక్త కార్యదర్శి నీతూ ప్రసాద్, మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీపీ మొదలవలస చిరంజీవి, శ్రీకాకుళం, విజయనగరం బీజేపీ అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఒకవైపు చర్చలు.. మరోవైపు నోటీసులా?

● సమగ్ర శిక్ష ఉద్యోగుల మండిపాటు

అరసవల్లి, జనవరి 6: 'ప్రభుత్వం ఒకవైపు యూనియన్‌తో చర్చలు సాగిస్తుంటే.. మరోవైపు మరోవైపు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయడం దారుణం. ఇటువంటి చర్యలను ఖండిస్తున్నామ'ని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ అన్నారు. శనివారం శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మెలో ఆయన మాట్లాడారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చల్లో నోటి మాటతో హామీలిస్తే సరిపోదని, రాతపూర్వకంగా ఇవ్వాలని కోరారు. సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేసారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సీఎం జగన్ అప్పుల అప్పారావు



వైసీపీ నేత అట్టాడ రాంప్రసాద్‌కు కండువా వేసి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు, సమావేశానికి హాజరైన జనం

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, జనవరి 6: సీఎం జగన్మోహన్ రెడ్డి అప్పుల అప్పారావుగా మారాడని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం రాత్రి మర్రిపాడులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇప్పటివరకు 36 మంగళవారాలకు గాను 34 వారాలు అప్పు కోసం రిజ్వర్ బ్యాంక్ చుట్టూ తిరిగాడన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని దేశంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ఇప్పటి వరకు రూ.13 లక్షల కోట్లు అప్పులు చేశాడన్నారు. సమస్యల సాధన కోసం అంగన్‌వాడీలు, ఎస్ఎస్ఏ, మునిసిపల్ పారిశుధ్య కార్మికులు రోడ్డెక్కారని, రాష్ట్రా ఆందోళనాంధ్రప్రదేశ్‌గా సీఎం మార్చాడని విమర్శించారు. పాదయాత్ర సందర్భంగా ప్రజలకు 703 హామీలిచ్చి వాటిలో కేవలం 73 మాత్రమే నెరవేర్చాడన్నారు. మర్రిపాడు, భావనపాడు, దేవునల్తాడ పంచాయతీలో మూడేళ్లుగా వంశధార నీరు రాక పంటలు ఎండ పోయినా కనీసం ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గతంలో తమ ప్రభుత్వం ఉన్నప్పుడు సకాలంలో సాగునీరందేలా చర్యలు తీసుకొన్నామని, ప్రకృతి కన్నెర చేస్తే కరువు మండలాలుగా ప్రకటించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, కింజరాపు హరిప్రసాద్, మెండ దాసు నాయుడు, బోయిన రమేష్, బగాది శేషగిరి, వెలమల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యమై రా కదలిరా: శిరీష



పలాస: వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికి రాష్ట్రాన్ని కాపాడుకు నేందుకు ప్రతీ ఒక్కరు కదలి రావాలని, ఇదే ఉద్దేశంతోనే 'ప్రజా చైతన్యమై రా కదలిరా' కార్యక్రమం చేపడుతున్నామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అవినీతి అరాచక పాలనను తుదముట్టించడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు దగా పడ్డారని ప్రభుత్వ ప్రైవేటు భూముల తేడా లేకుండా కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. వీరిని తరిమికొ ట్టేందుకు అందరు కలిసికట్టుగా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ● **వజ్రపు కొత్తూరు:** టీడీపీలో యువతకు తగిన ప్రాధాన్యం లభిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతుశిరీష అన్నారు. శనివారం తెలుగుయువత రూపొందిం చిన 2024 క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. టీడీపీ విజయానికి యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు మరడ ధుర్యోధనరెడ్డి, కొవ్వూరు సురేష్, గేదేల నరేష్, కొనారి కిరణ్‌కుమార్, తామాడ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలన విముక్తికే 'రా..కదలిరా'

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

అరసవల్లి: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సైకో పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించేందుకు 'రా.. కదలిరా'లో ప్రజలు పాలుపంచుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అవినీతి, అరాచక పాలనను తుదిముట్టించడం మనందరి బాధ్యత అన్నారు. ఒక్క సారి అని అడిగాడని అవకాశమిస్తే ఒక్కరినీ వదలకుండా అన్ని వర్గాలకూ జగన్‌రెడ్డి అన్యాయం చేశా డని, అమలు చేయని హామీలతో ప్రజలను మోసం చేసి గెలిచాడని, ఈ మోసాన్ని అంతం చేయడానికే ఈ కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. బీసీలకు రాజ్యాధికారం తెచ్చిన పార్టీ టీడీపీయేనని అన్నారు.

బొడ్డులూరు టీడీపీ ఆత్మీయ సమావేశం

మందస: నల్లబొడ్డులూరులో శనివారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డు జగన్నాథం, బొడ్డు వాసు, కూర్మారావు, శ్యామ్‌సందేశ్, హరికృష్ణ, కర్రి తాతారావు పాల్గొన్నారు.

టీడీపీ విజయమే లక్ష్యం కావాలి: కలమట



కొత్తూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మాతల క్యాంప్ కార్యాలయంలో మాకువరం, మదనాపురం, సోమరాజపురం, ఆకుల తంపర, నివగాం, కుద్దిగాం, ఓంద్రుజోల గ్రామ పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రజావ్యతిరేక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో నాయకులు పి.మోహన్, అగతముడి మాధవరావు, నెల్లి అచ్యుతరావు, గార భాస్కరరావు, వాన సర్వేశ్వరరావు, ఏడు పంచాయతీల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలి: లక్ష్మీదేవి



అరసవల్లి: వైసీపీ అరాచక పాలను స్వస్తి పలకాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. శనివారం ఆమె తన స్వగృహంలో విలేకరులతో మా ట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా స్వామ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని, భూములు కబ్జాలు చేస్తు న్నారని విమర్శించారు. రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకు పోయిం దని, ఈ పరిస్థితుల్లో చంద్రబాబు వంటి నాయకుడు మాత్రమే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలరన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సింతు సుధాకర్, ముద్దాడ కృష్ణమూర్తి, సీర రమణయ్య, లోపింటి రాధా కృష్ణరెడ్డి, జల్లు రాజీవ్ పాల్గొన్నారు.

జలుమూరు (సారవకోట): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బుడితి బీసీ కాలనీలో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు మట్ట గోవిందరావు, తర్ర సత్యం, చల్ల జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. ● **పొందూరు:** వావిలపల్లిపేటలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, పైడి వాసు తదితరులు పాల్గొన్నారు. ● **ఆమదాలవలస:** మునిసిపాలిటీ పరిధిలో చిన్నబజార్, కుప్పినవారివీధి, కృష్ణానగర్, రైల్వే క్వార్టర్స్ ప్రాంతాల్లో టీడీపీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహిం చారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ కార్యదర్శి బోర గోవిందరావు, నాయకులు బరాటం వైకుంఠం, మొయ్యి రమణ, చిరంజీవి, కృష్ణ, నాగళ్ల మురళీధర్, రాడ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా టీడీపీ



టీఎన్‌టీయూసీ నాయకులకు వినతి పత్రం అందిస్తున్న జట్టు కలాసీలు

నరసన్నపేట: కార్మికుల శ్రమ నుంచి పుట్టిన పార్టీ టీడీపీ అని, వారికి అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక జట్టు కలాసీ యూనియన్ భవనం వద్ద టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన చంద్రన్న కార్మిక బస్సుయాత్ర చేరుకోగా ఆయన సంఘీ భావం తెలిపారు. కార్మికుల శ్రమ తెలిసిన నాయకుడు చంద్రబాబు అని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, పంచకుల వృత్తుల కార్మికులను రోడ్డున పడేసిన సీఎం జగన్ రెడ్డిని ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గోట్టిముక్కల రఘురామరాజు, రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు, నియోజవర్గ అధ్యక్షుడు కింజరాపు మునలినాయుడు, జట్టు కలాసీ యూనియన్ నాయకుడు నేతింటి జనార్దనరావు, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెంతుఒరియాలను ఎస్టీల్లో చేర్చొద్దు

నందిగాం: బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఆదివాసీ చైతన్య వేదిక మండలశాఖ అధ్యక్షుడు మొగిలిపాటి జగ్గారావు డిమాండ్ చేశారు. శనివారం పలు గిరిజన గ్రామాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. జిల్లాలో నిజమైన బెంతు ఒరియాలు లేరని, వక్రమార్గంలో కుల ధ్రువీకరణ పత్రాలు పొందాలని చూస్తున్నారన్నారు. సంఘ ప్రతినిధులు ఎం.గణపతి, ఎస్.భుజంగరావు, ఆర్.లక్ష్మి, బి.కృష్ణంరాజు, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

9న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

జలుమూరు (సారవకోట): జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు అనంత నాయక్ ఈనెల 9న జిల్లాలో పర్యటిస్తున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శ్రీకాకుళం చేరుకొని ముందుగా టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ సన్యాసిపేట గిరిజన గ్రామాన్ని సందర్శిస్తారన్నారు. అక్కడి నుంచి భీంపురం గిరిజన బాలికలు ఆశ్రమ పాఠశాలను సందర్శించి అనంతరం మెళియాపుట్టిలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాలను, పాతపట్నం సీహెచ్‌సీని సందర్శిస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళంలో ఆదివాసీ సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నారన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు

నరసన్నపేట: సత్యవరం జంక్షన్ వద్ద కాలువ పోరంబోకు స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవె న్యూ, పంచాయతీ అధికారులు శనివారం అడ్డుకున్నారు. బొరిగివలసకు చెందిన ఒక వ్యక్తి సంబంధిత ప్రాం తంలో గతంలో ఇళ్ల నిర్మాణాలకు పునాదులు వేశారు. అప్పట్లో అధికారులు పునాదులను తొలగించారు. మరలా అదే వ్యక్తి గుట్టు చప్పుడు కాకుండా నిర్మాణం చేపట్టేందుకు ఉపక్రమించగా విలేకరులు పంచాయతీ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా తహసీల్దార్ సింహాచలం, ఈవో చిన్నారావు సదరు స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

చెట్ల చౌర్యంపై చర్యలకు మూడునెలలు చాలలేదా?

పాతపట్నం: వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలోని టేకు చెట్లను దొంగిలించిన వారిపై చర్యలు తీసుకునేందుకు మూడు నెలల సమయం చాలలేదా అని అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార పార్టీ నేతలే దొంగతనాలకు పాల్పడినట్లు స్వపక్ష ఎంపీటీసీలే ప్రశ్నించడంతో అధికారులు తెల్లమొఖం వేశారు. ఈ నేపథ్యంలో అధికారులు సమాధానం చెప్పాలని ఎంపీటీసీలు యరకయ్య, రేణుక పట్టుబట్టడంతో అరగంటపాటు సమావేశం నిలిచిపోయింది. గత సమావేశంలోనే ఈ అంశం ప్రస్తావించినా ఇంతవరకు చర్యలు లేవన్నారు. అటు తరువాత మరో ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో చెట్ల తొలగింపుపై టీడీపీ నేతపై కేసు పెట్టారని, అయితే అంతకుముందు జరిగిన ఘటనలో వైసీపీ నేతలపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. దీనికి ఎంపీడీవో జయంతిప్రసాద్ స్పందిస్తూ ఎస్ఐని ప్రశ్నిస్తానని సమాధానం చెబుతుండగా వారు అంగీకరించలేదు.సమావేశంలో జడ్పీటీసీ లింగాల ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తేమ విషయంలో రైతులకు ఇబ్బందులు

పలాసరూరల్: పండించిన పంటను మిల్లులకు తరలిస్తుంటే ధాన్యం తేమ విషయంలో మిల్లర్ల కొర్రీలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ఆర్బీకేలో ఒకలా, మిల్లుల్లో మరోలా తేమ శాతం చూపిస్తుండడంతో రైతులు ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. ఏవో పోలారావు మాట్లాడుతూ.. తేమశాతం విషయంలో ఆర్‌బీకేల ద్వారా తెలిపిన వాటితోనే రైతులు వారి పంటలను మిల్లులకు తరలించాలన్నారు. ఈ ఏడాది 3.32 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో తహసీల్దార్ ఎల్.మధుసూదనరావు, జడ్పీటీసీ మచ్చ రత్నాలు, వైస్ ఎంపీపీ టి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లయినా మరుగుదొడ్లు పూర్తిచేయరా?



పాతపట్నం: పాతపట్నం బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి నాలుగున్నరేళ్లయినా వైసీపీ ప్రభుత్వానికి చాలలేదా అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్ ప్రశ్నిం చారు. శనివారం సదరు ప్రాంతంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరుగు దొడ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. తక్షణం దీని నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనకల నారాయణ, రుంకు చలపతిరావు, నల్లి లక్ష్మణ, బి.వసంత, కలమట భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించాల్సిందే

పలాస: అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ కోరారు. ఈ మేరకు శనివారం కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తల స్థానంలో నియమించిన సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ నుంచి సరఫరా అవుతున్న పౌష్టికాహారాన్ని సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, టెక్కలి బ్రాంచ్, టెక్కలి వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాళి మండలం, కస్పానౌపదా గ్రామం కాపురస్తులైన శ్రీ/శ్రీమతి లోపింటి సునీల్‌కుమార్ S/o విజయ రామారావు వీరి ప్రోపర్టీని సూరిటీగా తీసుకోని వీరికి ఋణమునకు హామీగా అతని స్వాధీన, హక్కు అనుభవములోనున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు పతిపాదించియున్నారు. కావున సదరాస్తిపై వేరెవ్వరికయినా ఎట్టి హక్కుగాని, ఆసక్తిగాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రచురింపబడిన ఏడు దినములలోగా వారి యొక్క ఆక్షేపణలను నాకుగాని, నా క్లయింటుకుగాని తెలియపరచవలెను. లేని యెడల సదరాస్తి పైగాని, దానిపై జరపబోవు తాకట్టుపైగాని ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని భావింపబడునని యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : శ్రీకాకుళం జిల్లా, టెక్కలి స.రి.వారి యిలాకా, సంతబొమ్మాళి మండలం, కస్పానౌపదా పంచాయితీ, కస్పా నౌపదా గ్రామంలో యున్న ఆస్తి వివరం: సర్వే నెం. 485-3, పల్లం, క్రయ విస్తీర్ణం ఎ.శె.:0-85 1/2, హెక్టార్లు: 0.342 అనగా 4138.2చ.గజాలు కల్గియున్న ఖాళీస్థలంనకు **హద్దులు: తూ:** లోపింటి కామేశ్వరరావు వగైరాలు జి.పల్లం భూమి, **ద:** రోడ్డు, **ప:** మీ తాలూకా జి.పల్లం భూమి (కొన్నవారిది), **ఉ:** లోపింటి కామేశ్వరరావు వగైరాలు జి.పల్లం భూమి.

D.V.Viveikananda, Advocate, Tekkali, Cell : 9440436751

బాధితులకు ఎంపీ పరామర్శ

దీర్ఘాశి(పోలాకి): వెదుళ్లవలస మిల్లు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన దీర్ఘాశి మాజీ ఎంపీటీసీ మెండ శ్రీనివాసరావును, ఇంటి నిర్మాణం చేపడుతూ ఎత్తునుంచి ప్రమాద వశాత్తు పడి గాయపడిన డి.అప్పన్నను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఎల్.ఎన్.పేట: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని రజకచైతన్య సేవాసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామారావు అన్నారు. చిన్నకొల్లివలస ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో శనివారం పాతపట్నం నియోజకవర్గ స్థాయి రజక సంఘ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కావాలంటే రజకులంతా సంఘటితంగా ప్రభుత్వంతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం 13మంది సభ్యులతో కోర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సింహాచలం, ముఖ్య నాయకులు బి.మోహనరావు, యు.పాండురంగారావు, ఎస్.కృష్ణ, ఎస్.ధర్మారావు, బి.హరి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు శివాజీ పరామర్శ

వజ్రపుకొత్తూరు: అనంతగిరి పంచాయతీ వెంకటాపురానికి చెందిన లొడగల పాపయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి గౌతు శివాజీ శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పెద్దబొడ్డపాడుకి చెందిన దుంపల వెంకటమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని శివాజీ పరామర్శించారు. ఆయనతోపాటు నాయకులు ధుర్యోధన రెడ్డి, వెంకటరెడ్డి, చినయ్య గాలి ఆనంద్, లొడగల భాస్కరరావు, గంగయ్య ఉన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం

నరసన్నపేట: అంగన్‌వాడీలు విధుల్లో చేరకుంటే ఎస్మా చట్టం ప్రయోగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నరసన్నపేట ఐసీడీఎస్ పీవో నాగమణి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 12 నుంచి అంగన్‌వాడీలు సమ్మెలో ఉండడంతో బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదని, దీనిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి జీవో నెంబరు 2ను విడుదల చేసిందన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

జలుమూరు: కొత్తగా పెంచిన పింఛన్లను శనివారం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పేదలకు నేరుగా పింఛన్లు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, సర్పంచ్ ఇప్పిలి దుర్గమ్మ, ఎంపీడీవో ఎ.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులను అభివృద్ధి చేయాలి

జలుమూరు: వ్యవసాయ భూములకు సాగునీరందేలా చెరువులను తీర్చిదిద్దాలని ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ జేడీ ఎల్.కోదండరావు సూచించారు. ఇటీవల రెవెన్యూ సిబ్బంది చెరువులను సర్వేచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన నేపథ్యంలో శనివారం నగిరికటకంలోని చెరువులను పరిశీలించారు.చెరువులు ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. ఏఎస్‌వో కృష్ణంరాజు, వీఆర్వో రామారావు పాల్గొన్నారు.

సంప్రదాయ ప్రతీకలు.. రంగవల్లికలు

పలాస/ కాశీబుగ్గ/ పలాస రూరల్/ వజ్రపుకొత్తూరు/ మందస, జనవరి 6: సంప్రదాయ ప్రతీకలుగా రంగవల్లికలు ప్రతిబింబిస్తాయని పలువురు వక్తలు అన్నారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సహకారంతో పలాస మదర్ థెరిస్సా విద్యాలయంలో ముత్యాలముగ్గు పోటీలు శనివారం నిర్వహించారు. అతిథులు, స్పాన్సర్లు, న్యాయ నిర్ణేతలు, విజేతల అభిప్రాయాలు వారి మాటల్లోనే...



లోగోలు వేస్తున్న మహిళలు



ముగ్గుల పోటీ విజేతలతో స్పాన్సర్లు, అతిథులు, న్యాయ నిర్ణేతలు

కళలు, సంప్రదాయాలను పరిరక్షించాలి: గౌతు శిరీష

కళలు, సంప్రదాయాలను పరిరక్షించుకునే బాధ్యత మనదేనని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. ముగ్గుల పోటీకి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతి' నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, మహిళలు మరిచిపోతున్న ముగ్గులను వారితోనే ప్రతి ఏటా పోటీల రూపంలో వేయిస్తుండడం అభినందనీయమన్నారు. మదర్ థెరిస్సా విద్యాలయం డైరెక్టర్ వజ్జ భవాని మాట్లాడుతూ.. మహిళలు మరిచిపోతున్న ముగ్గులను మళ్లీ నేర్చుకోవాలని, తాము ప్రోత్సాహం అందిస్తామన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, కెనరా బ్యాంకు మేనేజర్ కమలాకర్ మాట్లాడుతూ.. ముగ్గుల పోటీలు నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్, యాడ్స్ సిబ్బంది బి.రవీంద్ర, వి.సత్యం, పలాస పీసీ సెంటర్ రిపోర్టర్లు, నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మహిళలు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడే బాధ్యత పత్రికలదే



సంప్రదాయాలు కాపాడే బాధ్యత పత్రికలే తీసుకోవాలి. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు వల్ల మహిళల్లో స్ఫూర్తి నింపుతోంది. మరిచిపోతున్న సంప్రదాయాన్ని వెలికితీయడం అభినందనీయం. పోటీలే కాదు నిత్యం మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసేలా తీర్చిదిద్దాలి.

- వజ్జ బాబూరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

ఇల్లాలి ముగ్గు ఇంటికే అందం



ఇల్లాలి ముగ్గు ఇంటికే అందం అంటారు పెద్దలు. అటువంటి ముగ్గులను ఒకే వేదికపై వేయడం సాహసంతో కూడిన పని. ముగ్గుల ద్వారా మహిళల మనసు గ్రహించవచ్చు. చుక్కల ముగ్గుల ద్వారా జీవితాలను ఏ విధంగా సరి దిద్దుకోవాలో పెద్దలు చెప్పారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలి.

- కామేశ్వరరావు, మేనేజర్, కెనరాబ్యాంకు

కుటుంబ బాధ్యత చెబుతోంది

ముగ్గుల ద్వారా కుటుంబ బాధ్యత చెబుతోంది. ఇంటిముందు ముగ్గులు వేయడం ద్వారా శుభం జరుగుతుందని పెద్దలు చెబుతారు. ఇటువంటివి పోటీల ద్వారా మహిళల్లో సృజనాత్మకత వెలికితీయడం విశేషం. ప్రతి మహిళ ఇంటి ముందు ముగ్గులు వేసే సంప్రదాయాలు కొనసాగించాలి.

- ప్రీతిచౌదరి, ప్రిన్సిపాల్, సత్యసాయి విద్యానికేతన్, న్యాయనిర్ణేత

నిర్ణయం తీసుకోలేని విధంగా ముగ్గులు

నిర్ణయం తీసుకోలేని విధంగా మహిళలు పోటాపోటీగా ముగ్గులు వేశారు. ఒక్కో ముగ్గు ఒక్కో అర్థం చెబుతోంది. పల్లెటూరి వాతావరణం నుంచి సామాజిక స్పృహ కలిగించేలా ముగ్గులున్నాయి.

- కవిటి భారతి, ప్రిన్సిపాల్, సాయిశిరీష స్కూల్, చిన్నబడాం, న్యాయనిర్ణేత

ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి అభినందనలు

ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు. మరుగున పడుతున్న మన సంప్రదాయాలను కాపాడేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయం. పల్లెటూరి వాతావరణం కల్పించేలా ముగ్గులు పోటీలు నిరంతరం కొనసాగించాలి.

- కల్పన, ఉపాధ్యాయిని, న్యాయనిర్ణేత



ముగ్గుల పోటీలో సామాజిక చైతన్యం... బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ ముగ్గు

చికిత్స పొందుతూ మహిళ మృతి

నందిగాం: కొత్తగ్రహారం పంచాయతీ జడ్యాడ గ్రామానికి చెందిన తరిణి హరిత(23) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హరిత కొన్నేళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతోంది. ఎప్పటికీ వ్యాధి నయం కాకపోగా మరింత బాధిస్తుండడంతో మనస్తాపానికి గురై శుక్రవారం సాయంత్రం పురుగులమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలికి తల్లిదండ్రులు నాగమ్మ, వెంకట్రావు, వివాహిత సోదరి ఉన్నారు. నాగమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ ఆలీ కేసు నమోదు చేశారు.

స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలం రాగోలులో శనివారం కొత్తూరు నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొంది. అయితే ఈ స్కూటీ మీద వెళ్తున్న కరజాడ గ్రామానికి చెందిన పాగోటి రమణమూర్తి వాహనం మీద నుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానికులు ఆర్టీసీ డ్రైవర్‌ను పట్టుకుని నిలదీశారు. రోడ్డు గుంతలమయం కావడంతో స్కూటీ గొయ్యిలో దిగి పడిపోవడంతో బస్సు కిందకు వచ్చేసిందని బస్సులోని ప్రయాణికులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్ఐ విజయకుమార్ పరిశీలించారు. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు


జలుమూరు: లింగాలవలసలో శనివారం పాన్‌షాపు వద్ద మద్యం విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. అలాగే కరకవలస కాలనీకి చెందిన ఎర్ర బాబూరావు అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తుండగా జలుమూరు కూడలిలో పట్టుకొని అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

వరి చేను కుప్పలు దగ్ధం

మెళియాపుట్టి: అంపురం పంచాయతీ పెంగువాడకి చెందిన లంబ సూరయ్యకు చెందిన ఐదెకరాల వరిచేను కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు రాజుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించినా వాహనం రాలేని పరిస్థితితో కుప్పలు పూర్తిగా కాలిపోయాయి. తనను అధికారులు ఆదుకోవాలని కోరుతున్నాడు. గతంలో అనేక సార్లు విద్యుత్ వైర్లు మార్చాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ జమ్మయ్య పేర్కొన్నారు.

వారి తీరు మారలే..

- సింగుపురం పీహెచ్‌సీ సందర్శించిన డీఎంహెచ్‌వో
- వైద్యులు, సిబ్బంది విధులకు డుమ్మాపై ఆగ్రహం



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

శ్రీకాకుళం క్రైం: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి.. ఎంతో బాధ్యతగా ఉండాల్సిన రూరల్ మండలం సింగుపురం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది తీరు మారలేదు. ఈ నెల 4న 'సమయపాలన లేక.. సేవలందక' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌వో స్పందించి శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో ఉండాల్సి వైద్యాధికారిని చాందినితోపాటు మరో వైద్యురాలు, ఐదుగురు సిబ్బంది విధులకు రాకుండా డుమ్మా కొట్టారు. వారి తీరుపై డీఎంహెచ్‌వో అసహనం వ్యక్తం చేశారు. పలు రికార్డులు పరిశీలించి, రక్త పరీక్షల రికార్డుల్లో తేదీలు తారుమారు చేసినట్టు గుర్తించారు. డుమ్మా కొట్టిన వైద్యులతోపాటు సిబ్బందిని వివరణ కోరారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రజలకు సేవలందించాల్సిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. నిబంధనలు అతిక్రమించినవారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా కొద్ది రోజులుగా ఈ పీహెచ్‌సీలోని వైద్య సిబ్బంది పనితీరుపై విమర్శలు వస్తున్నా వారి తీరు మారకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగాల నుంచి తొలగింపు

శ్రీకాకుళం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించిన క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఐదుగురు ఆర్బీకే సిబ్బందిని జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించినట్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు విధానంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న క్వాలిటీ ఇన్‌స్పెక్టర్.. బియ్యం నాణ్యతా ప్రమాణాలు పరిశీలించడంలో అలసత్వం వహించారు. దీని కారణంగా ఆమెను విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. అలాగే, మిల్లులకు ధాన్యం రవాణా చేసేందుకు తప్పుడు ట్రక్ షీట్లను జనరేట్ చేసి, వేరే వాహనాల్లో ధాన్యం తరలించిన ఆర్బీకే డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఎల్.హేమలత (పెద్దలంబ, సారవకోట), వి.యోగీశ్వరి (కిన్నెరవాడ, సారవకోట), కృష్ణ (బోడవరం, నరసన్నపేట), షణ్ముఖరావు (పాలవలస, సరుబుజ్జిలి), ఎం.గౌరినాయుడు (కొండవలస, సరుబుజ్జిలి)ను ఉద్యోగాల నుంచి తొలగించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న బెంతు ఒరియాల ధర్నా

కవిటి: బెంతు ఒరియా కులస్థులు ధ్రువీకరణ పత్రాల కోసం చేపడుతున్న నిరవధిక దీక్ష 10వ రోజుకుచేరుకుంది. శనివారం మాణిక్యపురం గ్రామానికి చెందిన యువకులు దీక్షలో పాల్గొన్నారు. రిటైర్డ్ డీఎస్పీ ప్రసాద్ మద్దతు తెలిపారు.

స్పీకర్ తమ్మినేనికి పరామర్శ

ఆమదాలవలస: స్పీకర్ తమ్మినేని సీతారాం అస్వస్థతకు గురై విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు శనివారం వైసీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఉన్నారు.

అన్నక్యాంటీన్లను వైన్‌షాపులుగా మార్చిన ఘనుడు జగన్

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

శ్రీకాకుళం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పేదవారి ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను మూసేసి, వైన్ షాపులుగా మార్చిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ విమర్శించారు. స్థానిక ఏడు రోడ్ల జంక్షన్ వద్ద టీఎన్‌టీయూసీ నిర్వహిస్తున్న చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పేదల కడుపు కొట్టిన ద్రోహి జగన్‌రెడ్డి అని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని, అంగన్వాడీలకు ఏకంగా రూ.4800 వేతనం పెంచామని గుర్తు చేశారు. ఇసుకను ఉచితంగా అందించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకున్నది, వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం, టీడీపీ అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి, జామి భీమశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాకేమీ తెలియదు

- హాస్టల్‌లో ఘర్షణపై వైద్య విద్యార్థుల సమాధానం
- రిమ్స్ సూపరింటెండెంట్ విచారణ

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు గురువారం రాత్రి వసతి గృహంలో ఘర్షణకు దిగడంపై రిమ్స్ సూపరింటెండెంట్ ఎ.స్వామినాయుడు ఎట్టకేలకు విచారణ చేట్టారు. హౌస్ సర్జన్స్ వసతి గృహంలో శనివారం ఆర్ఎంవోలు సుభాషిని, రామ్‌ప్రకాష్, రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవి వెంకటాచలంతో కలిసి ఆయన విద్యార్థులను విచారించారు. ఘర్షణ జరిగిన రాత్రి హాస్టల్‌లో ఉన్న 10 మంది విద్యార్థులను విచారణకు హాజరుకావాలని పిలిస్తే ఆరుగురు మాత్రమే వచ్చారు. వీరిని విడివిడిగా అధికారులు విచారించారు. వసతి గృహంలో చేసిన బీభత్సంపై ప్రశ్నిస్తే.. తమకేమీ తెలియదని విద్యార్థులు సమాధానం చెప్పారు. దీంతో ఏదో విషయం దాస్తున్నారని అర్థమౌతుంది. వీరందరి నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణకు నలుగురు విద్యార్థులు గైర్హాజరవడంపై విచారణాధికారులతో పాటు వైద్యసిబ్బంది కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎంవో వి.సుభాషిని మాట్లాడుతూ.. జరిగిన ఘటనను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వారిని రిమ్స్‌కు పిలిపిస్తామని తెలిపారు. వారి సమక్షంలో విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక నుంచి వసతి గృహంలో విద్యార్థుల హాజరు కూడా తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ రాత్రి 10 గంటల తరువాత వసతి గృహంలో విద్యార్థులు ఉన్నది లేనిది వార్డెన్‌లు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు శనివారం హాస్టల్‌లో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. మరో నాలుగు సీసీ కెమెరాలు అమర్చి విద్యార్థుల కదలికలపై దృష్టి సారించనున్నట్లు ఆర్ఎంవో తెలిపారు.

మునిసిపల్ ఉద్యోగులను అడ్డుకుని నిరసన



ఇచ్ఛాపురం: ఉద్యోగులను అడ్డుకుంటున్న కార్మికులు

పలాస: తమ న్యాయపరమైన కోర్కెలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటుకు తాళం వేసి పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. దీంతో సిబ్బంది లోపలకు వెళ్లలేకపోయారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. పోలీసులు, పారిశుధ్య కార్మికుల మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తత నెలకొంది. కార్మిక సంఘ నాయకులు ఎన్.గణపతి, మురుగన్, చాపర వేణుగోపాలరావు, తామాడ సన్యాసిరావు, శ్రీనివాసరావుపాల్గొన్నారు.

- **ఇచ్ఛాపురం:** సమస్యల పరిష్కారం కోరుతూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు చేపడుతున్న సమ్మె 12వ రోజుకు చేరింది. శనివారం సమ్మెలో భాగంగా మునిసిపల్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలుపుతూ అధికారులు కార్యాలయం లోపలికి వెళ్లకుండా అర గంటపాటు అడ్డుకున్నారు.
- **ఆమదాలవలస:** మునిసిపల్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దన్ మాస్టార్, ఆమదాలవలస పెన్షన్ సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు కార్మికులకు సంఘీభావం తెలిపారు. యూనియన్ లీడర్స్ సంతోష్, తారకేశ్వరరావు, శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు

ఆరోగ్యకరమైన వాతావరణం అవసరం

ఎచ్చెర్ల: ఆరోగ్యకరమైన వాతావరణంతోనే మహిళా సాధికారిత సాధ్యమని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సన్యాసినాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం ఎచ్చెర్లలోని లింగ వివక్ష, యాంటీ ర్యాగింగ్ అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ నేరమని, విద్యార్థులు స్నేహ పూర్వక వాతావరణంలో చదువుకోవాలని సూచించారు.

జిల్లాకు కొత్తగా రెండు సీఐ పోస్టులు

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం జిల్లాకు రెండు కొత్త సీఐ పోస్టులు మంజూరయ్యాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా విశాఖ రేంజ్‌లో ఉన్న 20 మంది సీఐలకు బదిలీలయ్యాయి. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్, సైబర్ సెల్ సీఐలను అదనంగా నియమిస్తూ విశాఖ రేంజ్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐగా విశాఖ సిటీలో విధులు నిర్వహించిన టి.ఇమాన్యుయల్ రాజును, సైబర్ సెల్‌కు జి.దేముడును నియమించారు. అలాగే జిల్లాలోని టెక్కలి పోలీసు స్టేషన్‌ను సర్కిల్ పోలీస్ స్టేషన్‌గా అప్‌గ్రేడ్ చేశారు.

బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ

పొందూరు: కార్మికులపై రాష్ట్రప్రభుత్వం అవలంబిస్తున్న విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి కార్మికుల్లో చైతన్యం తీసుకురావడానికి తెలుగుదేశం పార్టీ టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టర్‌ను ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు ఆవ్కిరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గాడు నారాయణరావు, నాయకులు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న వైసీపీ

పొందూరు: రాష్ట్రంలో రైతులను వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తీవ్ర అన్యాయం, దగా చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ విమర్శించారు. మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం విలేఖరులతో మాట్లాడారు. మిచౌంగ్ తుఫాన్‌తో దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రతీ గింజా కొంటామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి సొంతపత్రికలో కోట్లు ఖర్చుపెట్టి ప్రకటనలిచ్చి ఇప్పుడు రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాల్సిన జిల్లా అధికారులు మిల్లర్లతో కలిసిపోయి రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పొందూరు ఖాదీకి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ పథకంలో అవార్డులు రావడంపై హర్షనీయమన్నారు. ఇదే సమయంలో ఖాదీపరిశ్రమ అభివృద్ధికి, కార్మికుల జీవన ప్రమాణాలు పెరిగేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులను ఆదుకుంటామన్నారు. అలాగే రాపాక, కింతలి, తదితర గ్రామాల్లో కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు కె.శ్రీనివాసరావు, డి.రవి, వాసు, బలగ శంకరభాస్కర్, కె.గొల్లయ్య కె.మనోహర్ తదితరులు పాల్గొనారు.

ఆదిత్యుని సన్నిధిలో మాతాజీ

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శనివారం ఉదయం గుంటిధామ్ ఆశ్రమం, కురుక్షేత్ర, హర్యానాకు చెందిన గుంటివాలి మాతాజీ దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో అందజేశారు.

స్పెషల్ డ్రైవ్ పరీక్షలకు వినతి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో సెమిస్టర్ విధానం రాకమునుపు ఫెయిలైన విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించాలని పలువురు ఫోన్ ఇన్ లైవ్‌లో కోరారు. వర్సిటీలో శనివారం డయల్ యువర్ వర్సిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిగ్రీలో ఒక సబ్జెక్ట్ తప్పి ఉపాధి అవకాశాలు పొందకుండా పోతున్నామని పలువురు విద్యార్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు, బీసీడీఈ కో-ఆర్డినేటర్ అజయ్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. కాగా వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్యకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వీసీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.





రేపటి నుంచి ఎస్ఐ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

శ్రీకాకుళం క్రైం: ఇటీవల విశాఖలో జరిగిన ఎస్ఐ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలు పరిశీలనకు హాజరు కావాలని విశాఖ రేంజ్ ఐజీ హరికృష్ణ శనివారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8,9 తేదీల్లో ఎంపికైనవారంత విశాఖ రేంజ్ ఐజీ కార్యాలయానికి ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

గార: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం కె.మత్స్యలేశంలో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల భవనాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తొలుత బందరువాని పేటలో రోడ్డు పనులకు మంత్రి భూమి పూజ చేసి మాట్లాడారు. ఎంపీపీ రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లకు షోకాజ్ నోటీసులు

కలెక్టరేట్: జిల్లాలోని 31 రైస్ మిల్లర్లకు షోకాజ్ నోటీసులు శనివారం కలెక్టర్ జారీ చేశారు. రైతుల నుంచి రెండు కిలోలకు మించి అదనంగా ధాన్యాన్ని డిమాండ్ చేస్తున్నారనే అంశంపై సంబంధిత అధికారుల విచారణలో నిర్ధారణ కావడంతో కలెక్టర్ వారిని బ్లాక్ లిస్టులో పెట్టారు. ఇకపై ఏ మిల్లర్ అయిన రైతుల వద్ద నుంచి అదనంగా ధాన్యం తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

